

ఎపిలో మళ్లీ వైసిపిదే అధికారం

- జిల్లా అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీఖాన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

2024లో ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ వైసిపి ఫ్యాన్ గాలి వీస్తుందని, తప్పక పార్టీ విజయం సాధిస్తుందని అన్నమయ్య జిల్లా వైఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. 2019లో అధికారంలో చేపట్టిన వైసిపి ప్రభుత్వంలో ప్రజల జీవన ప్రమాణాలనుమెరుగుపడ్డాయని అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక 99 శాతం అమలు చేయడంతో పేద వర్గాల్లో అధికార వైసిపి ఆదరణ మరింత పెరిగిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఓటర్లు వైసిపి మరోసారి అవకాశం కల్పించనున్నారు. చాణిక్య, ఆరా మస్తాన్, సిపి ఎస్, పర్దా దాస్, జన్ మత్ లాంటి సర్వేలు 2024 ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెబుతున్నాయని పేర్కొన్నారు.

కొండెక్కిన కోడి


- కిలో చికెన్ రూ.270
- సామాన్యునికి ధరాఘాతం





ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కోడి ధర కొండెక్కింది. కోడితో సమానంగా కూరగాయలు, పప్పుదినుసుల ధరలు పోటీపడి పెరు గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకూ చికెన్, కూరగాయలు, పప్పుదినుసుల ధరలు మూకుమ్మడిగా పరస్పరం అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. చికెన్ ధర పెరిగిన నేపథ్యంలో పప్పు దినుసుల వైపు మళ్లుదామనుకుంటే ధరాఘాతం దెబ్బకు సామాన్యుడు కుదేలవుతున్నాడు. శాఖాహారం వైపు మళ్లుదామనుకుంటే కూరగాయల ధరలు షాక్ కొడుతోంది. కంది పప్పు ధర కిలో రూ.200, చికెన్ ధర రిటైల్ మార్కెట్‌లో రూ.270, టమోటా రూ.35 నుంచి క్యారెట్ రూ.70 వరకు పలుకుతోంది. చికెన్ ధరలతో పప్పుదినుసులు, కూరగాయల ధరలు సమానంగా పెరుగుతుండడంతో సామాన్యులకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది. వేసవిలో వేడిమి తీవ్రత గణనీయంగా పెరగుతుండడంతో చికెన్ ధర అమాంతంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.



చికెన్ ధర రోజురోజుకు పైపైకి పెరుగుతోంది. కడప, ప్రొద్దు టూరు, రాజంపేట ప్రాంతాలను మినహాయిస్తే ఎక్కడా కోళ్లఫారాలు కనిపిం చడం లేదు. ఇటీవలి వేసవి సీజన్‌లో వేడిమి తీవ్రత కోళ్ల ఫారాలపై ప్రభావం చూపించినట్లు తెలుస్తోంది. వేడిమి తీవ్రత 47 డిగ్రీల వరకు పెరగడంతో లక్షలాది కోళ్ళు మృతి చెందడం చికెన్ ధరల పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. దిగుమతులు అనివార్యంగా మారినట్లు తెలుస్తోంది. జిల్లాలో చికెన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మదనపల్లి, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి దిగు మతి చేసుకో వాల్సి వస్తోంది. సుగుణ, వెంకో బ్ వంటి సంస్థల నుంచి చికెన్ వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్నారు. వేసవి తాపం తీవ్రతకు సుమారు 20 శాతం కోళ్లు మృతి చెందినట్లు సమాచారం. కొనుగోలు చేసిన కోళ్లు వేసవి తీవ్రతకు బరువు పెరగలేదు. సహజంగా బాయిలర్, నాటు కోళ్లను 45 రోజులపాటు పెంచితే రెండు కిలోల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత వేసవి పరిస్థితుల్లో కిలో పెరుగుదల కూడా కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఈఏడాది వేసవిలో 47 నుంచి 52 డిగ్రీల వరకు జిల్లాతోపాటు తెలంగాణ, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో గణనీయంగా పెరిగింది. ఫలితంగా కోళ్ల దిగుబడులు గణనీయంగా తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణ అవసరాలకు సరిపడా బాయిలర్ కోళ్లు అందుబాటులో లేవు. పల్లెప్రాంతాల నుంచి డిమాండ్ పెరగడంతో ధరలకు రెక్కలొచ్చినట్లు తెలుస్తోంది. నాటుకోళ్లు పల్లెలకు పరి మితం కావడం తెలిసిందే. ఒకవేళ నాటు కోడి మాంసాన్ని కొనుగోలు చేద్దామనుకుంటే నాటుకోడి చికెన్ కిలో రూ.750పైగా పలుకుతోంది. పల్లెప్రాంతాల వాసులు సైతం బాయిలర్ కోళ్ల మాంసంపైనే అధికంగా ఆధార పడుతున్నారు.మ చికెన్ ధరలు ఆకాశనంటుతుంటే మార్కెట్లో కూరగాయల, పప్పు దినుసుల ధరలూ అమాంతంగా పెరిగిపోయాయి. టమోటా, పచ్చిమిరపకాయలు మొదలుకుని బీట్‌రూట్, క్యారెట్ వరకు రూ.50 నుంచి రూ.80లకుపైగా పలుకుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ధరల పెరుగుదలను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

ఎవరి ధీమా వారిదే!



- అందరి దృష్టి కౌంటింగ్‌పైనే
- ఇరు పార్టీల కేడర్‌లో గందరగోళం

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఎవరి ధీమా వారిదే అనే ధోరణి కనిపిస్తోంది. శనివారం విడుదల చేసిన ఎగ్జిట్‌పోల్స్ సర్వేలు స్పష్టతను ఇవ్వకపోగా మరింత గందరగోళాన్ని పెంచడం ఉత్కంఠకు దారితీశాయని చెప్పవచ్చు. ఒకవైపు కొన్ని సర్వే సంస్థలు అధికార వైసిపికి, మరి కొన్ని సర్వే సంస్థలు ప్రతిపక్ష కూటమికి మద్దతుగా ఫలితాలను వెల్లడించడంతో ఆయా పార్టీల కేడర్లో గందరగోళం నెలకొంది. ఫలితంగా బెట్టింగురాయుళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ నెల నాలుగవ తేదీన నిర్వహించనున్న కౌంటింగ్ వైపు అందరి దృష్టి నిలిచింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ఉత్కంఠభరిత పోరును తలపించాయి. కడప పార్లమెంట్ పరిధిలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ నియోజక వర్గాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంట్, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు నియోజకవర్గాలు ఉన్నాయి. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు 50 మంది అభ్యర్థులు, ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాలకు 180 మంది అభ్యర్థులు పోటీ పడిన సంగతి తెలిసిందే. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకుని క్లైమాక్స్ సీన్ కౌంటింగ్ వరకు ఉత్కంఠ రాజ్యమేలుతోంది.

నాడీ పట్టని ఎగ్జిట్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ప్రభుత్వ వ్యతిరేకత బాహాటంగా వ్యక్తం కావడం సహజం. కానీ 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో సైతం అధికార వైసిపి, ప్రతిపక్ష కూటమి పోటీలు పడుతున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలకు మించి పోలింగ్ శాతం పెరిగిన నేపథ్యంలో పెరిగిన ఓటింగ్ చర్చనీయాంశంగా మారింది. పెరిగిన ఓటింగ్‌ను ఎవరిఖాతాల్లో వారు వేసుకోవడానికి పోటీ పడిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే ఓటింగ్ శాతం పెరిగిందని, కాబట్టి పెరిగిన ఓటు తమకే పడిందని టిడిపి, సంక్షేమ పథకాల అమలు కారణంగా మహిళల, వృద్ధుల ఓట్లు, అధికార వైసిపి వైపు నిలిచారనే కోణంలో తమ ఖాతాల్లో అంటే తమ ఖాతాల్లో పడ్డాయని పోటీలు పడ్డారు. దేశంలో ఏడవ దశ పోలింగ్ ముగిసిన అనంతరం ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు సూచాయగా వెల్లడవుతుందని ఆశించారు. ఎగ్జిట్‌పోల్స్ సరళిని గమనిస్తే గెలుపోటములు తేలిపోతాయని భావించిన వారి నిరాశే ఎదురైనట్లు కనిపిస్తోంది. జాతీయ, రాష్ట్ర సర్వే సంస్థలన్నీ ఎన్‌డిఎ, ఇండియా వేదిక, రాష్ట్రంలో అధికార వైసిపి, ఎన్‌డిఎ కూటమి మధ్య ఎగ్జిట్ పోల్స్‌ను వెలువరించాయి. సర్వే సంస్థలపై రాజకీయ ఒత్తిళ్లు వగైరా కారణంగా స్పష్టత కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది. జాతీయ సర్వే సంస్థలు ఎన్‌డిఎ కూటమికి పట్టం కట్టగా, రాష్ట్రంలోని స్థానిక సర్వే సంస్థలు అధికార వైసిపి, కూటమికి సమానంగా మిశ్రమ ఫలితాలను వెలువరించడం గందరగోళానికి దారితీసింది. రాష్ట్రంలో అధికార పీఠాన్ని ఎవరు అధిష్టించనున్నారనే అంశంపై సందిగ్ధత కొనసాగు తోంది.



జోరు తగ్గని బెట్టింగ్

ఎగ్జిట్‌పోల్స్ అస్పష్టత కారణంగా బెట్టింగు జోరందుకుంది. ఇదే అదునుగా భావించిన బెట్టింగ్‌రాయుళ్లకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రాష్ట్రంలోని సుమారు 40 ఎగ్జిట్ పోల్స్ సంస్థలు వెలువరించిన ఫలితాల ఆధారంగా పెద్దఎత్తున బెట్టింగులకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకత్వం బెట్టింగులకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నప్పటికీ ఎక్కడా వెనక్కి తగ్గుతున్న దాఖలాలు కనిపించడం లేదు. రూ.లక్షకు రూ.లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకు బెట్టింగుల పరంపర నిలకడగా కొనసాగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం జూన్ నాలుగున నిర్వహించనున్న కౌంటింగ్‌పై అందరి దృష్టి నిలిచిందనడంలో సందేహం లేదు.

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండలంలో తీవ్ర వర్షాభావం, ఎండల తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో అరటి చీని నిమ్మ ఆకు తోటలు ఎండిపోతున్నాయని, తక్షణమే ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డిపల్లి, కొలుముల పల్లె పంచాయతీల్లోని పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఒకపక్క మరోపక్క ఎండ తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో రైతులు వేసిన పంటలు అరటి, చీని నిమ్మ పంటలు కోత దశలో నీటి తడులు అందక నిలువునా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరటి ఆకు తోటలకు సాగు పెట్టుబడి ఖర్చులు ఎకరాకు లక్ష రూపాయలు పైగా ఖర్చు వస్తుందని ఈ తరుణంలో బోరు బావులు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో లేత దశలోనే పంటలు ఎండిపోతున్నాయని, వారు కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉన్నదని ఎకరాకు కౌలు రూ.50 వేలు పైగా పెట్టి సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో పంటలు నష్టపోయిన రైతులను కలుపుకొని ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి మండల నాయకులు రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, రైతులు పాల్గొన్నారు.



ఎండిపోయిన అరటి పంటను పరిశీలిస్తున్న నాయకులు

గాలివాన బీభత్సం

నేలకొరిగిన అరటి, బొప్పాయి, నిమ్మ



రాజంపేట : గాలివాన బీభత్సానికి నేలకొరిగిన అరటి



కలికిరి : నేలకొరిగిన బొప్పాయి పంట

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గాలివాన బీభత్సం సృష్టించింది. శనివారం రాత్రి అనూహ్యంగా రాజంపేట మండల వ్యాప్తంగా అనేకచోట్ల గాలివాన బీభత్సానికి వృక్షాలు నేలకొరిగాయి. వందల ఎకరాలలో రైతులు పంటలు నష్టపోయారు. ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు తెలిపిన వివరాల మేరకు...శనివారం వీచిన బలమైన ఈదురు గాలులు, వర్షం వలన ప్రాథమిక అంచనా ప్రకారం దాదాపు 210 ఎకరాలలో అరటి, 15 ఎకరాలలో బొప్పాయి, 7 ఎకరాలలో నిమ్మ నేలకొరిగాయి. మండలంలోని హస్తవరం, పోలి, మందరం, మందపల్లె, బ్రాహ్మణపల్లె, పెద్దకారంపల్లె, ఆకేపాడు గ్రామాలలో అధికంగా పంట నష్టం జరిగింది. రాజంపేట ఆర్‌బికెల పరిధిలో పంట నష్టం ప్రాథమిక నివేదికను జిల్లా అధికారులకు పంపారు. ప్రభుత్వం నుంచి పంట నష్ట నివేదిక మార్గదర్శకాలు జారీ అయిన వెంటనే ఆర్‌బికెల పరిధిలో నష్టపోయిన రైతుల జాబితాను నష్టపరిహారం కోసం పంపడం జరుగుతుందని వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యాన వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రాల పరిధిలో నష్టపోయిన రైతుల పంటలను ప్రస్తుతం పరిశీలించడం జరుగుతుందని తెలియజేశారు.

రామపురం: మండలంలో శనివారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఇంటి పైకప్పులు లేచిపోయి చాలామంది నిరాశ్రయులయ్యారు. కుమరపల్లి పంచాయతీలో దూదేకులపల్లిలో గ్రామంలో నివాసమున్న సుంకేసుల కృష్ణయ్యరాజు, బండపల్లిలో షేక్ ముబారక్, మోహన్, లక్ష్మయ్య, జమాల్‌వలి ఇంటిపై రేకులు ఎగిరిపోవడంతో రాత్రంతా పిల్లలు, మహిళలు కుటుంబ సభ్యులందరూ ఆరుబయట గడపవలసి వచ్చిందని బాధితులు వాపోయారు. షేక్ అబ్దుల్ సాబ్ ఇంటిపై విద్యుత్ స్తంభం విడిపోవడంతో భయంతో కుటుంబ సభ్యులు, పిల్లలు, మహిళలు బయటకు పరుగులు తీశారు. వర్షంలో రాత్రంతా బయట గడవాల్సిందని బాధితులు వాపోయారు. అధికారులు తమ గ్రామాన్ని సందర్శించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కలికిరి : వడగండ్ల వర్షానికి మండలంలోని బొప్పాయి తోటలు నేలమట్టమయ్యాయి. వడగండ్ల వర్షంతో పాటు తీవ్రమైన ఈదురుగాలులు వీయడంతో పదుల ఎకరాల్లో బొప్పాయి తోటలు నేలమట్టం అయ్యాయి. వడగండ్ల ప్రభావంతో ఆకులు, చెట్టు సుడులు విరిగిపోవడంతో పూత, కాథ పూర్తిగా రాలిపోయింది. గుట్టపాలెం పంచాయతీ, చీకటిపల్లి మేడికుర్తి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా కౌలుకు భూములు తీసుకుని బొప్పాయి సాగు చేస్తుంటారు. వడగండ్ల వర్షం పలు ప్రాంతాల్లో వ్యవసాయ రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. దోస, కర్బూజా, బొప్పాయి, టమోట పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా లక్షలు ఖర్చుపెట్టి సాగు చేస్తున్న బొప్పాయి, దోస రైతులు పంట మొత్తం ధ్వంసం అవడంతో బోరున విలపిస్తున్నారు. పంట నష్ట తీవ్రతను బట్టి రైతులను ప్రభుత్వమే ఆదుకొని నష్టపరిహారాన్ని అందించాలని వారు కోరుచున్నారు. ఈదురు గాలులు కు పలు చోట్ల చెట్లు, కరెంటు స్తంభాలు విరిగి పడిపోవడం తో గుట్టపాలెం పంచాయతీలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామ స్తులు త్రాగునీటితో పాటు పది రకాలుగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.



రామాపురం : గాలికి లేచిపోయిన ఇంటి పైకప్పు



కంటి రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

26 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 26 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, కలకడ, కలికిరి, కె.విపల్లి, ఎర్రవారిపాలెం, గుర్రం కొండ, పెద్దమండెం, ఎన్.పి.కుంట, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హులైన 26 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు ఉచితంగా అద్దాలు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి స్వరూప గుప్తా, కోశాధికారి శివప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, లయన్ జయరామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం : సిఐ

ప్రజాశక్తి-మదనపల్లి

శాంతిభద్రతల పరిరక్షణమే ధ్యేయమని మదనపల్లి వన్ టౌన్ సిఐ వలి బాష, టూ టౌన్ సిఐ జి.యువరాజు అన్నారు. మంగళవారం జరగబోయే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్నమయ్య జిల్లా ఎస్‌పి బి.కృష్ణారావు, మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఐలు వెంకటసుబ్బయ్య, హరిహర ప్రసాద్, ఎపిఎస్‌పి సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది స్థానిక పోలీసు సిబ్బంది అందరూ కలిసి బెంగళూరు బస్టాండ్ నుండి ఆర్‌ఆర్ స్ట్రీట్, చంబకూరు రోడ్డు, కమ్మ వీధి, శాస్త్రీ వీధి, నెహ్రూ బజార్ అప్పారావు తోట, సైదాపేట, బడే మకాన్, పలు ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుతం ఎలక్షన్ కోడ్‌తో పాటుగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదని చెప్పారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కేసుల నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం జరగబోయే కౌంటింగ్ సందర్భంగా ప్రజలందరూ కూడా ప్రశాంత వాతావరణం కొరకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గన్‌తో కాల్చుకుని

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



పట్టణంలో ఎఆర్ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటనడ కలకలం రేపింది. ఎఆర్ మహిళా కానిస్టే బుల్ కె.వేదవతి(28) గన్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఆదివారం వేధవతి డ్యూటీకి యథావిధిగానే హాజరయ్యారు. ఆ తరువాత ఏంజరిగిందో ఏమో.. తన దగ్గర ఉన్న గన్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సెంట్రీగా విధులు నిర్వర్తిస్తూ ఉన్నప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. వేదవతి ఆత్మహత్యకు పాల్పడిందా లేక పొరపాటున గన్ ఫైర్ అయిందా తెలియరాలేదు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అసలు వేధవతి ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సమస్యలా? లేదా విధుల్లో ఒత్తిడి ఏమైనా ఉందా? ఇంకా వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరుగుతోంది. కుటుంబ సభ్యుల నుంచి కూడా వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. ఈ మేరకు డిఎస్‌పి రామచంద్రరావు, అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదవతి మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా మృతురాలి భర్త పేరు దస్తగిరి. ఆయన సొంత ఊరు మదనపల్లి. వేదవతి సొంత ఊరు పుంగనూరు దగ్గర బింగానిపల్లె. దస్తగిరి పుంగనూరులో పోలీస్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో ప్యాకల్టీగా పనిచేస్తూ అక్కడ వేదవతి ట్రైనింగ్ తీసుకునే సమయంలో ఇద్దరు ప్రేమించుకుని 2016 సంవత్సరంలో పెళ్లి చేసుకున్నారు. వేదవతి చిత్తూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సంవత్సర క్రితం బదిలీపై అన్నమయ్య జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చింది. ప్రస్తుతం దస్తగిరితో కలిసి వేదవతి రాయచోటి పట్టణంలోని రాజీవ్ స్వగృహకు పక్కనగల ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటోంది. ఆమెకు ఒక కుమార్తె ఉన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్ : వేసవి విజ్ఞాన శిబిరాలు శాస్త్రీయ పరిజ్ఞానానికి సోపానాలని జెవివి జిల్లా కోశాధికారి సమీర్ బాషా అన్నారు. ఆదివారం కొండాయపల్లిలోని జిల్లా గ్రంథాలయంలో 'వేసవి విజ్ఞాన శిబిరంలో' భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'వినోదంతో కూడిన విజ్ఞానం' అనే అంశంపై సమీర్ బాష మ్యాజిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిని చైతన్యవంతుల్ని చేయడానికి ఇలాంటి వేసవి విజ్ఞాన శిబిరాలు చాలా అవసరమన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న ఈ రోజుల్లో కూడా కొంతమంది స్వాములు, గారడి బాబాలు, భూత వైద్యులుగా చలామణి అవుతున్నారని చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - రాయచోటి

కడప, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా అక్రమంగా అడ్మిషన్స్ నిర్వహించాయని, విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా వారికే వత్తాసు పలుకుతున్నారని పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్ ఆరోపించారు. రాయచోటి పట్టణంలో మాసాపేటలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కడప నగరం, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, మైదుకూరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో ఉన్నా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభం కాకమునుపే ఇప్పటికే 60 శాతం అడ్మిషన్లు పూర్తి చేశారని, విద్యార్థులతో నిబంధనలుకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారని చెప్పారు. కేవలం నర్సరీకే రూ.30 వేల నుండి రూ. 40 వేల వరకు తల్లిదండ్రుల దగ్గర నుంచి వసూలు చేస్తున్నారని అదేవిధంగా పలు పాఠశాలలు సిబిఎస్ఇ సిలబస్ లేనప పృటికీ ఉన్నట్లు ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రచారం నిర్వహిస్తున్నారని, గుర్తింపు లేని పాఠశాల వివరాలు విద్యాశాఖ అధికారులు పత్రికలకు తెలియజే యకుండా మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై విచారించి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకుడు విగ్నేష్, పిడిఎస్‌యు పట్టణం నాయకులు చిన్నారెడ్డి, మహేష్,శివకేశవ,వాసు, దేవానాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనాథ్



అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరితో బోధిషా వలి, శివకుమార్

ఎఫ్‌పిఒలదే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-పీలేరు

వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల కారణంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి చెప్పారని జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు బోధిషావలి తెలిపారు. ఆదివారం అధికారిక పర్యటనలో భాగంగా తిరుపతికి వచ్చిన చిరంజీవిని బోధిషావలి, కెవి పల్లి మండలం, నూతనకాలువకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ రైతు శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆయన ఉద్యాన శాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో చిరంజీవి చౌదరి పీలేరు ప్రాంతంలో రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ఏర్పాటుకు పెద్ద ఎత్తున ప్రోత్సహించారు. తన హయాంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌పిఒల పనితీరును ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారని బోధిషావలి అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి, రైతులకు నాణ్యమైన గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే రైతులు ఎఫ్‌పిఒ లుగా మారాలని చిరంజీవి చౌదరి సూచించినట్లు తెలిపారు. పీలేరు ప్రాంత రైతులకు ఉపయోగకరంగా ఉంటున్న పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం గురించి ఆయన ప్రత్యేకంగా అడిగినట్లు బోధిషా వలి తెలియజేశారు. అవకాశం దొరికితే త్వరలోనే ఎఫ్‌పిఒను సందర్శిస్తానని కూడా మాటిచ్చినట్లు చెప్పారు.

జిల్లాలో టిబి మందులకు కొరత లేదు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్సార్ కడప జిల్లాలో ఎక్కడా టిబి మందులకు కొరత లేదని అమరావతి టిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు ఆసుపత్రిలో అవసరమైన టిబిమందులు లేవని జరుగుతున్న ప్రచారం నిజం కాదని పేర్కొన్నారు. కడప జిల్లాలో అవసరమైన స్థాయిలో టిబి నివారణ మాత్రలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని టిబి రోగులెవరికీ మందులను బయటి నుంచి కొనుగోలు చేయమని వైద్యులెవరూ సూచించలేదని పేర్కొన్నారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సూచనల మేరకు కడప జిల్లా టిబి అధికారి ఇప్పటికే మందుల్ని అవసరమైన స్థాయిలో అందుబాటులో ఉంచారని తెలిపారు. అంతేకాక స్థానికంగానే టిబి మందుల్ని కొనుగోలు చేసి మరీ మందులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు ఎవరు కూడా బయట మందులు కొనుక్కోమని ఏ పేషెంట్ కూ చెప్పలేదని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఏడుగురు రోగులకు కూడా ఇంకా నాలుగు రోజులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కూడా మందుల నిల్వల్ని తగినంతగా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇటీవల తాము అన్ని జిల్లాలను సమీక్షించామని, అలాగే కేంద్ర సరఫరాలను కూడా ఎప్పటికప్పుడు జిల్లాలకు పంపుతున్నామని పేర్కొన్నారు. కడప జిల్లాకు పంపిన మందులు వెయ్యి మంది రోగులకు ఒక నెలరోజుల వరకు సరిపోతాయని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా టిబిమందుల కొరత లేదని పేర్కొన్నారు.

ప్రేక్షకులను అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ నాగార్జున స్కూల్ చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో, శిల్పారామంలో స్థానిక శ్రీ రాజా కళానిలయం ఆధ్వర్యంలో చిన్నారుల క్లాసికల్, జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పా రామం పరిపాలన అధికారి సుధాకర్, శిక్షకులు చిట్టి, వినోద్, స్కూల్ కరస్పాండెంట్ కుమార్ పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నగరంలోని శిల్పారామంలో చిన్నారులు డ్యాన్స్ చేసి ఆదివారం సందడి చేశారు. సాంస్కృతిక కళావేదికపై మిస్పా మూవీ సహకారంతో బద్వేల్‌కు చెందిన 'అనూష్‌బాబు' అకాడమి బృందం వారు జానపద, శాస్త్రీయ, సినీగీతాలకు డ్యాన్స్ చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలనాధికారి ఎం.మునిరాజు పర్యవేక్షించారు.

కంటి సమస్యలపై ప్రజలను జాగృతం చేయాలి : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు పడాల్సివస్తుందని కంటి సమస్యలపై ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనవిజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర నాయకులు తవ్వా సురేష్ పేర్కొన్నారు. స్థానిక జెవివి కార్యాలయంలో ఆదివారం సమ్మర్‌క్యాంప్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ తేజ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని గ్రహించేందుకు కళ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కంటి విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ తేజ మాట్లాడుతూ మెరుగైన ఆహారాన్ని తీసుకుంటే కంటి సమస్యలను దూరం చేయవచ్చన్నారు. ఏ విటమిన్, బీటా కెరోటిన్, ఒమేగా3 ఫ్యాటీ ఆసిడ్లు, విటమిన్ సి వంటివి ఎక్కువగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, నట్స్ సరిపడినన్ని తినాలన్నారు. కంప్యూటర్, టివి, మొబైల్స్‌తో ఎక్కువ కాలం గడిపేవారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, పట్టణ ఉపాధ్యక్షులు వి.రాజశేఖర్, కో-ఆర్డినేటర్లు భరత్, అక్షయ, హాసిని, తేజ, పృథ్వీక, అంజి పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో 'ఉపాధి హామీ' పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతిరోజు 3,200 మందికిపైగా కూలీలు పనులకు హాజరవుతున్నారు. కెసి కెనాల్, వంకల్లో.. చెరువుల్లో పూడికతీత పనులు, పంట కాలువలు పనులు చేపడుతున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఎండలు అధికంగా ఉన్నప్పటికీ ఈ ఏడాది ప్రభుత్వం గతంలో మే నెలలో అదనంగా మంజూరు చేసే వేసవి అలవెన్సులు రూ.30 చెల్లించడం లేదు. రూ.200 నుంచి రూ.250 వరకు కూలి అందుతుందని కూలీలు తెలిపారు. విశ్వనాథపురం వద్ద పంట కాలువల పనులు చేపడు తున్నారు. పల్లవోలు, నాగులపల్లె, ఖాదర్‌పల్లె గ్రామాల వద్ద చెరువులు, వంకల్లో పనులు చేస్తున్నారు. సిద్దారెడ్డిపల్లె వద్ద వంకలో కంప చెట్ల తొల గింపు, పూడికతీత, పంట కాలువల పనులు చేపడుతున్నారు. వెదురూరు వద్ద పంట పొలాలు, కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. జాబ్ కార్డ్ కలిగిన కూలీలకు పనులు చూపుతున్నామని ఎపిఒ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంపిడిఒ, ఎపిఎం ఇసి, టెక్నికల్ అసిస్టెంట్లు పనులను తనిఖీ చేస్తున్నారు.



వంకలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-టి.సుండుపల్లి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఎస్‌పి బి.కృష్ణారావు ఆదేశాల మేరకు టి.సుండుపల్లి సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ ఎస్‌కెఎం.హుస్సేన్ పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో పోలీస్ స్టేషన్ నుంచి మడితాడు, రాయవరం గ్రామాలలో బిఎస్ఎఫ్ జవానులతో కలిసి కవాతు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమై జూన్ 4 వ తేదీ వరకు ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. నాయకులు వారి అనుచరులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి పిడి ఆక్ట్ అమలు చేస్తారని అన్నారు. నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తారని, మూడవ తేదీ నుంచి మద్యం అమ్మకాలు నిలిపివేస్తారని, ఎక్కడైనా మద్యం తాగి బయట కనబడితే కేసులు నమోదు చేస్తారని చెప్పారు. మండల కేంద్రానికి జిల్లా కేంద్రాలకు ఎవరు వెళ్లకూడదని, ఎవరి ఇంటిలో వారు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గెలిచిన అభ్యర్థుల అనుచరులు గానీ, నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఊరేగింపులు కానీ, క్రాకర్స్ కాల్చడం గాని జరపు రాదని అన్నారు. 7న పోలీసుల అనుమతితో ఊరేగింపులు జరుపుకోవాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీసు లకు సహకరించి మండలం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగ కుండా చూసుకోవాలని హితవు పలికారు. ప్రజలందరూ సంయమనం పాటి స్తూ, పోలీస్ వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టే బుల్ రాజు, ప్రవీణ్, స్టేషన్ సిబ్బంది, బిఎస్ఎఫ్ మిలిటరీ బలగాలు పాల్గొన్నారు.



రాయవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



బాస్కెట్ బాల్ క్రీడకు హాజరైన క్రీడాకారులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా డిఎస్‌డిఒ గౌస్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులకు మెళు కువలు, క్రీడలకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా చింతల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు క్రీడల్లో పాల్గొనడం వలన శరీరం ఉల్లాసంగా, మనిషి ఉత్సాహంగా ఉంటారన్నారు. క్రీడాకారులు పట్టుదలతో రాణిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు అవుతారన్నారు. వాల్మీకిపురంలో శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు పోలీస్, పిఇటి, పిడి, ఆర్మీ ఉద్యోగాల్లో చేరి మంచి స్థాయిల్లో ఉన్నారన్నారు. ఈ వేసవి శిక్షణా శిబిరంలో 30రోజుల పాటు క్రీడాకారులకు పాలు, గ్రుడ్లు, రొట్టెలు ఉచితంగా అందించి, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులచే శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం డిఎస్‌డిఒ మాట్లాడుతూ వాల్మీకిపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తోందని, తాను జిల్లాలో ఎన్నో వేసవి శిక్షణ శిబిరాలు సందర్శిచడం జరిగిందని, వాల్మీకిపురంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం క్రీడాకారులు కూడా బాస్కెట్ బాల్ క్రీడలో మంచి పట్టు సాధించడం పట్ల అభినందించారు.

శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి కడప అర్బన్

అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు అన్వేష్, దస్తగిరి రెడ్డి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయ శాఖ ఆలయాలు సంబంధించి నిష్పక్షపాతంగా అభివృద్ధి చేయడం లేదని తెలిపారు. దేవాదాయ స్థలాలను, కాంప్లెక్స్‌లను అనుకూలమైన వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. 11 ఏళ్ల నుంచి జిల్లాలోనే కొనసాగుతూ ఉన్నారని చెప్పారు. ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠంలో ఆయనపై పెద్ద ఎత్తున వివాదాలు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రస్టులో వారసులను కాకుండా బయట వ్యక్తులను నియమించి ఆ స్థలాలను, ట్రస్టులో ఉన్నటువంటి నిధులను కాజేసేందుకు సహకరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు దుర్వి నియోగమైందని, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ సభ్యునిగా అర్హత లేని వ్యక్తిని తొలగించాలని చెప్పారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాల చేయనని తెలిపారు. లాభాపేక్షతో స్థలాలను అమ్మే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్

కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం మొత్తం 918 మంది కౌంటింగ్ సిబ్బందికి రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎలక్షన్ కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించబడిన అబ్జర్వర్లు బిపిన్ కుమార్‌రాయ్, చరణ్‌జీలాల్, ఎకె.ప్రజాపతిల సమక్షంలో సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా కౌంటి ంగ్ సిబ్బందికి నియోజకవర్గాలను కేటాయించే రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిర్ణయించిన ప్రకారం కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ఇప్పటికే మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. రెండో విడత రాండమైజేషన్ ద్వారా 120 శాతం రిజర్వుతో కలిపి మొత్తం 918 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు నియోజకవర్గాలను కేటాయించామని చెప్పారు. ఈ నియామక ఉత్తర్వులను సంబంధిత రిటర్నింగ్ అధికారులు సిబ్బందికి అందివ్వనున్నట్లు చెప్పారు. 4న ఉదయం 5 గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి ఏ టేబుల్‌లో కౌంటింగ్ నిర్వహించాలో తెలియజేస్తామన్నారు. కళాశాలలో ఒకే ప్రదేశంలో అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశా మని అన్నారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన విధంగా శిక్షణ కూడా పూర్తి చేశామని చెప్పారు. అనం తరం కౌంటింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కళాశాల లొకేషన్, అందులో పార్లమెంటు, అసెంబ్లీ నియో జకవర్గాల స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు, బ్యారికేడింగ్, సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు, కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన మూడు అంచల భద్రత, స్ట్రాంగ్ రూములు కౌంటింగ్ హాల్స్ వద్ద చేపట్టిన చర్యలను ఎస్‌పి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అబ్జర్వర్లకు వివరిం చారు. కార్యక్రమంలో ఎస్‌పి బి.కృష్ణారావు, జెసి ఫర్మాన్‌అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు సిపిఒ కృష్ణానాయక్, ఎడి వెంకట్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నరసింహారావు, సంబంధిత నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వేధిస్తున్న రోడ్లు, డ్రెయినేజీ సమస్య



కనీస వసతులకు నోచని కాలనీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీని ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీ సమస్య వేధిస్తోంది. మైదుకూరు మున్సిపాలిటీ 2012లో మేజర్ పంచా యతీ నుంచి మున్సిపాలిటీగా మార్పు చేశారు. ఆ తర్వాత 2014లో మున్సి పాలిటీకి మొదటిసారిగా ఎన్నికలు నిర్వహించారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పురుషులు 18వేల మంది, మహిళలు 19 వేల మంది ఉన్నారు. మైదుకూరు సమీపాన ఉన్న కొన్ని చిన్న పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయితే మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంది. దీన్ని పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వర్షాకాలంలో నంద్యాల రోడ్డు, కడప రోడ్డు లోని ఆర్టీసీ బస్టాండ్ వరకు మీరు పూర్తిగా రోడ్లపైనే ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. మైదుకూరు చెరువుకు సంబంధించిన కాలువ పూర్తిగా ఆక్రమణకు గురి కావడంతో సమస్య పునరావృతమవుతోంది. 24 వార్డుల్లో ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు వేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. పట్టణంలో బద్వేల్, కడప రోడ్లు తక్కువ కాలంలో అభివృద్ధి చెందుతూ ఎక్కువ గృహాలు నిర్మిస్తున్నారు. అయినప్పటికీ ఈ కాలనీలను అభివృద్ధి పరచడంలో మాత్రం పాలకులు, అధికారులు వెనుకంజలో ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం, గొల్లపల్లె, శాంతినగర్, జోసఫ్‌పేట, బద్వేల్ రోడ్డులోని మహబూబ్ నగర్, ప్రొద్దుటూరు రోడ్డులోని మూలబాట వీధి, సంత రోడ్డు, మార్కెట్ నుండి సాయిబాబా గుడి తదితర కాలనీలు డ్రయినేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కడప రోడ్డులోని కొన్ని కాలనీల్లో వేసవిలో తాగునీటి సమస్య వెంటాడుతోంది. వేసవికాలంలో ట్యాంకర్ల ద్వారా రెండు మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేపడుతున్నారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయిస్తున్న వాటిని సద్వినియోగం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. అంతే కాకుండా మున్సిపాలిటీ పరిధిలో అవినీతి ఎక్కువగా చోటుచేసుకుంటోందని, నివారించడంలో కూడా అధికారంలో ఉన్న పార్టీలు నాయకులు, అధికారులు విఫలమయ్యారనే ఆరోపణ లున్నాయి. గత పాలకవర్గ సమయంలో మరుగుదొడ్ల నిర్మాణం, సిమెంట్ రోడ్ల ఏర్పాటులో రూ.మూడు కోట్ల వరకు అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతైనా మైదుకూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.



అధ్వానంగా ఉన్న మురుగు కాలువ



సమావేశంలో మాట్లాడుతున్న అంకన్న

'అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రవేట్ పాఠశాలలు యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు విరుద్ధంగా విచ్చలవిడిగా అక్రమంగా అడ్మిషన్స్ నిర్వహించారని పలు మార్లు విద్యాశాఖధికారులుకు పిర్యాదు చేసిన వారికే వాత్తసు పలుకుతున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న ఆరోపించారు. ఆదివారం పిడిఎస్‌యు రాయసీమ ప్రాంతీయ కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరం, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, మైదుకూరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు ప్రాంతాల్లో ఉన్నా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభం కాకమునుపే ఇప్పటికే 60 శాతం అడ్మిషన్స్ పూర్తి చేశారని తెలిపారు. అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థి చేత నిబంధనలుకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్ లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం నర్సరీకే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు తల్లిదండ్రుల దగ్గర నుంచి వసూలు చేస్తున్నారని చెప్పారు. అదేవిధంగా పలు పాఠశాలలు సిబిఎస్ఈ సిలబస్ లేనపప్పటికీ ఉన్నట్లు ఆయా పాఠశాలల యాజమాన్యంలు ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. కడప డిప్యూటీ డిఒఒ రాజగోపాల్ రెడ్డి, ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప, మదనపల్లె డిప్యూటీ డిఇఒ శ్రీరామ్ పురుషోత్తం కార్పొరేట్ యాజమాన్యాలకు ఒత్తిడికి తలొగ్గి మామూళ్ల లక్షలాది రూపాయలు తీసుకుంటున్నారన్నారని ఆరోపణలున్నాయి అన్నారు. ఈ విషయం తెలిసిన కడప జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, అన్నమయ్య జిల్లా డిఇఒ శివశంకర్ కూడా వారికే వాత్తసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల పై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పిడిఎస్‌యు అన్నమ్మయ్య జిల్లా నాయకులు స్వరూప్ తేజ, మనోజ్, సాయి సందీప్,ఖాదర్ బాషా పాల్గొన్నారు.

అనాథ వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సిరి నిరాశ్రయుల వృధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నిరాడంబరంగా తన కూతురు జన్మదిన వేడుకలు ఇలా చేశామని ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక నాగులకట్టలో తన కూతురు యమ్.వి.దివ్యశ్రీ జన్మదినం సందర్భంగా వేడుకలను ఆదివారం అనాథ వృద్ధుల సమక్షంలో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ వృద్ధుల కు బాసటగా నిలబడి తమ వంతు సహాయం చేయడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి సతీమణి మారెడ్డి రాధ, కూతురు ఎంవి దివ్యశ్రీ, కుమారుడు ఎంవి.నిహాల్ రెడ్డి పాల్గొన్నారు.

నేషనల్ అవార్డుకు సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడ్యుకేషనల్ రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ యూఎస్ఏ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే నేషనల్ అవార్డుకు ఎంపిక అయినట్లు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ చైర్మన్ డాక్టర్ తాళ్లూరు ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ అవార్డు ఎంపికకు సహకరించిన వైయస్సార్, అన్నమయ్య జిల్లాల చైర్మన్, డాక్టర్ డేవిడ్ కళ్యాణ్ రాజు, మైనారిటీ కడప జిల్లా చైర్పర్సన్ డాక్టర్ సయ్యద్ జుల్ఫికర్, మహిళా వింగ్ చైర్పర్సన్ అంకిరెడ్డి మేరీ, హెల్త్ వింగ్ చైర్ పర్సన్ అప్పల రెడ్డి సింధు, హ్యూమన్ రైట్స్ కుటుంబ సభ్యులకు కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్య సేవలను పరిగణలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం..తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - మైదుకూరు : శనివారం రాత్రి పెనుగాలుల తీవ్రతకు విద్యుత్ స్తంభం నేలకొరిగి పంట పొలాల్లో మంటలు వ్యాపించిన ఘటన మైదుకూరు మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలో చోటుచేసుకుంది. మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలోని పంట పొలాల్లో నుంచి వెళుతున్న కృష్ణాపురం ఫీడర్‌కు సంబంధించిన 11కెవి విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. జనసంచారంలేని ప్రదేశం కావడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు అందించిన సమా చారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సుమారు గంటన్నర మేరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆదివారం ఉదయం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించి యథావిధిగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

టిడిపి ఏజెంట్లకు దిశా నిర్దేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించిన టిడిపి- జనసేన - బిజెపి కూటమి జోన్ -5 విభాగపు శిక్షణ కార్యక్రమం ఆదివారం కడప నగరంలోని డిఎస్ఆర్ కల్యాణ మండపంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 5 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి ఉమ్మడి పార్టీల ఏజెంట్లు హాజరయ్యారు. శిక్షణా కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం పార్టీ జోన్ -5 ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బండారు మనోహర్ నాయుడు, సీనియర్ అడ్వకేట్ జి.ఎస్. మూర్తి,కర్నాటి అమర్నాథ్ రెడ్డి కౌంటింగ్ ఏజెంట్లకు మార్గనిర్దేశన చేశారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి వాల్మీకిపురం పట్టణంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. పొద్దుటూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రుక్మిణి దంపతుల కుమార్తె చౌడేశ్వరి(26) కలకడ మండలం, కదిరాయచెరువుకు చెందిన చౌడయ్య, రెడ్డెమ్మ దంపతుల కుమారుడు మంజునాథ్‌తో తొమ్మిది నెలల క్రితం వివాహం జరిగింది. మంజునాథ్ నిమ్మనపల్లి మండలం, కొండయ్యగారిపల్లి విలేజ్ సెక్రటరీగా పని చేస్తూ వాల్మీకిపురం పట్టణం బజారువీధిలో భార్యతో కలసి కాపురం ఉంటున్నాడు. అయితే శనివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమ యంలో చౌడేశ్వరి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు స్థానిక పోలీసులకు సమా చారం అందించగా, సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు చౌడేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతిరాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అలిగి వెళ్లిందని భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశకి-మదనపల్లి

భార్య అలిగి పుట్టినింటికి వెళ్లిందని భర్త పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లిలో చోటు చేసు కుంది. తాలూకా ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలంలోని బెంగుళూరు రోడ్డు, వేంపల్లె పంచాయతి కొనగుంట్ల పల్లెకు చెంది న శ్రీరాములు కొడుకు వాసు(25) భార్య రమ్య భర్తతో గొడవపడి, అలిగి వారం క్రితం పుట్టినింటికి వెళ్ళిందని అన్నారు. తిరిగి కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన వాసు టమోటా చెట్లకు కొట్టడానికి తెచ్చిన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. కుటుంబీకులు గమనించి బాధితుడిని చికిత్స కోసం వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించగా అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పిందని అన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.